ఆర్‌ఎన్‌ఆర్ రకానికి మంచి ధర

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆర్ఎన్ఆర్ రకానికి మంచి ధర పలుకుతోంది. మంగళవారం అన్నదాతలు మార్కెట్‌కు 13 బస్తాలు(తొమ్మిది క్వింటాళ్ల) ధాన్యం తీసుకొచ్చారు. ఖరీదుదారులు పరిశీలించి క్వింటాకు గరిష్ఠ, కనిష్ఠ ధర రూ.3151గా నిర్ణయించారు. సోమవారం రూ.2492 పలకగా ఒక్కరోజులోనే వీటి ధర రూ.659 పెరిగింది. బీపీటీ 1393 బస్తాలు రాగా క్వింటాకు గరిష్ఠ ధర రూ.3213, 533 బస్తాల జైశ్రీరాం వడ్లను రైతులు తీసుకురాగా గరిష్ఠ ధర రూ.3339గా ఖరీదుదారులు నిర్ణయించారు.


సూర్యాపేటలోని మార్కెట్ యార్డుకు రైతులు తీసుకొచ్చిన వడ్లు

కోతిబంధం ఆనకట్టకు గండి

నూతనకల్, న్యూస్‌టుడే: మండలంలోని తాళ్ల సింగారం శివారులో పాలేరు ఏటిలో వరదనీటిని నిలిపి మరో రెండు గ్రామాల చెరువులకు గొలుసు కట్టు కాల్వ ద్వారా చేరవేసి సాగునీటి కష్టాలు తీర్చాలనే లక్ష్యంతో సుమారు వంద ఏళ్ల క్రితం ఆనకట్ట నిర్మించారు. ఈ ఆనకటను ప్రభుత్వ నిధులతో మూడు సార్లు ఆధునికీకరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతిబంధ ఆనకట్ట వద్ద జలకళ సంతరించుకుంది. దీని కాల్వ ద్వారా ఆరు కిలోమీటర్ల దూరంలోని యడవెల్లి, నూతనకల్ చెరువులను నింపారు. మూడు రోజులుగా కాలువకు నామమాత్రంగా నీరు వస్తుండటంతో రైతులు పరిశీలించగా.. ఆనకట్టకు గండి పడినట్లు గుర్తించారు. అధికారులు వెంటనే స్పందించి గండిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు. 'క్షేత్రస్థాయిలో పరిశీలించి గండిని పూడ్చి కంపచెట్లను తొలగిస్తామ'ని నీటిపారుదలశాఖ డీఈ హరికృష్ణ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.


తాళ్లసింగారంలో ఆనకట్ట నుంచి వృథాగా పోతున్న వరదనీరు


షెడ్యూల్ వచ్చేసింది!

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే



వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటికి పూర్తి కానుండడంతో.. తదుపరి ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా రూపొందించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల షెడ్యూలు విడుదల చేసింది. ఈ నెల 30 నుంచి ఓటు నమోదుకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఈ నెల **30** నుంచి నవంబరు **6** వరకు దరఖాస్తుల స్వీకరణ



ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ఫారం-19 ద్వారా ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్‌లో ceotelangana.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దీనికి సంబంధించి అక్టోబరు 16, 25 తేదీల్లో ఎన్నికల అధికారులు ప్రకటనలు జారీ చేయనున్నారు. గతంలో ఓటు నమోదు చేసుకున్న వారు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని ఎన్నికల సంఘం సూచించింది.

ఇదీ షెడ్యూల్..

వరంగల్- ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల నమోదు కార్యక్రమం ఈ నెల 30 నుంచి ప్రారంభం కానుండగా.. నవంబరు 6 వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించారు. నవంబరు 23న ముసాయిదా జాబితా ప్రకటించి.. ఈ జాబితాపై అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరిస్తారు. డిసెంబరు 25 వరకు అభ్యంతరాలను పరిష్కరించి.. అదే నెల 30న ఓటరు తుది జాబితా విడుదల చేయనున్నారు.

గత ఎన్నికల్లో 7,243 మంది ఓటర్లు..

గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 68 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 7,243 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 4,737 మంది, మహిళలు 2,505 మంది, థర్డ్ జెండర్ ఒకరు ఉన్నారు.

★ నల్గొండ పట్టణంలో అత్యధికంగా 1,667 మంది ఓటర్లు ఉండగా.. రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత స్థానంలో సూర్యాపేటలో 880 మంది, మిర్యాలగూడలో 788 మంది, కోదాడలో 466 మంది, భువనగిరిలో 306 మంది, దేవరకొండలో 229 మంది, నకిరేకల్‌లో 217 మంది ఓటర్లు ఉన్నారు. ఈసారి ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

★ అన్ని మేనేజ్‌మెంట్ల ప్రభుత్వ పాఠశాలలు, అన్ని రకాల కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో పాటు నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు సైతం ఓటు నమోదుకు అర్హులు.

ఉమ్మడి జిల్లాలో 2019లో ఉన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
నల్గొండ	30	2,488	1,370	1	3,859
సూర్యాపేట	22	1,467	689	0	2,156
యాదాద్రి	16	782	446	0	1,228

సన్నాల సందడి..!

హుజూర్‌నగర్, కోదాడ, న్యూస్‌టుడే:

ప్రభుత్వం సన్నరకాల కొనుగోళ్లకు సిద్ధమవుతోంది. త్వరలో తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం సరఫరా చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికి తోడు ప్రభుత్వం సన్నరకాల ధాన్యం పండించిన వారికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని గతంలోనే ప్రకటించింది. దీంతో రైతులు గతంలో కంటే సన్న రకాల ధాన్యం అధికంగా సాగు చేశారు.


★ ఉమ్మడి జిల్లాలో 5,59,497 ఎకరాలలో సన్నరకాలు సాగు చేయగా.. అందులో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో పోటాపోటీగా జరిగింది. ఉమ్మడి జిల్లాలో సన్నరకాల ధాన్యం 13,43,756 మెట్రిక్ టన్నులు పండుతుందని అంచనా వేస్తున్నారు. దాదాపు 4.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే అవకాశం ఉంది. పెరిగిన ప్రభుత్వ అవసరాల దృష్ట్యా ఇంకా ఎక్కువ కూడా కొనుగోలు చేసేందుకు అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.


హుజూర్‌నగర్: కోసిన తరువాత ఆరబెడుతున్న సన్నరకం ధాన్యం (పాత చిత్రం)


అంచనాలకు మించి..

వానాకాలం సీజన్‌లో పండే ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళిక ప్రకారం ప్రభుత్వం ముందుకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 904 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 394 ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, 471 పీఏసీఎస్, మరో 45 ఇతర కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అంచనాలకు మించి కొనుగోళ్లు చేసేందుకు సిద్ధమవుతున్నారు.


ఉమ్మడి జిల్లాలో సాగు వివరాలు (ఎకరాల్లో)



ధాన్యం దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)



కొనుగోళ్ల అంచనాలు (మెట్రిక్ టన్నుల్లో)



నిధుల్లేక నిలిచిన అభివృద్ధి పనులు: పుర ఛైర్‌పర్సన్

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: సూర్యాపేట పురపాలిక అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని, నిధులు రాక పలు పనులు నిలిచిపోయాయని పుర ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. సూర్యాపేట పుర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో ప్రభుత్వం నుంచి పట్టణ ప్రగతి, డీఎఫ్ నిధులు విడుదలయ్యాయని, ప్రస్తుతం రావడం లేదని, గుత్తేదారులకు బిల్లులు రాక పనులు నిలిచిపోయాయన్నారు. పలువురు కౌన్సిలర్లు వార్డు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పట్టణ ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారని, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం సరిగా అందటం లేదని ఆరోపించారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తే ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అజెండాలో పొందుపరిచిన 13 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో పుర కమిషనర్ శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ పుట్టా కిశోర్, ఈఈ కిరణ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


సూర్యాపేటలోని పుర కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, చిత్రంలో కమిషనర్ శ్రీనివాస్

మరమ్మతులు వేగవంతం చేయండి: మంత్రి

చిలుకూరు, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని నారాయణపురం(పాలెఅన్నారం) ఊరచెరువుకు పడిన గండ్ల మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు.

★ మండలంలోని ఆర్లెగూడెం ఆర్‌కే మేజర్‌కు పడిన గండి పనులను, నారాయణపురంలోని ఊర చెరువుకట్టకు జరుగుతున్న మరమ్మతు పనులను ఎమ్మెల్యే పద్మావతితో కలిసి మంగళవారం పరిశీలించారు. చెరువు కట్ట మరమ్మతు పనులకు రూ.1.50 కోట్లు మంజూరు చేయించామని, ఈ పనులను పది రోజులలో పూర్తి చేస్తామన్నారు.

★ చెరువు భూమి ఆక్రమణకు గురైనట్లు గ్రామస్థులు పలువురు మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో.. మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే ఆక్రమణదారులను గుర్తించి వారి నుంచి భూమిని కాపాడతామని హామీ ఇచ్చారు. అంతకుముందు ఆర్లెగూడెం పరిధిలోని రెడ్లకుంట మేజర్‌పై పండిన గండి మరమ్మతు పనులను, అనంతరం నీటిని విడుదల చేయడంతో ఆ ప్రదేశాన్ని మంత్రి, ఎమ్మెల్యే పరిశీలించారు.

★ సీఈ రమేశ్‌బాబు, ఎస్ఈ శివధర్మతేజ, ఈఈ సత్యనారాయణ, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, చిలుకూరు తహసీల్దారు ధ్రువకుమార్, ఇరిగేషన్ డీఈ స్వప్న, ఏఈఈ మానస పాల్గొన్నారు.


నారాయణపురంలో చెరువు కట్ట మరమ్మతు పనుల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాటలు సరికాదు: జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: భారాస హయాంలో నీటి పారుదల శాఖను నిర్వీర్యం చేశారన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ నీటి పారుదల విషయంలో మంత్రులకు అవగాహన, చిత్తశుద్ధి లేదన్నారు. కేసీఆర్ ఇచ్చిపోయిన వ్యవస్థలు ఉన్నది ఉన్నట్లుగా నడపలేకపోతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఒక్క వ్యవస్థ సరిగ్గా పనిచేయడం లేదన్నారు.

24 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న రూ. మూడు లక్షలు విలువైన 24 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాలతో ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ రాకేశ్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం తెల్లవారుజామున మండలంలోని కర్రోనితండాలో మకాం వేశారు. తెల్లవారుజామున 3.30 గంటలకు బెల్లం లోడుతో వెళ్తున్న ట్రాక్టరును పట్టుకున్నారు. అందులో 29 నల్లబెల్లం బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. అదేతండాలో గుగులోత్ లింగ్యా నివాసంలో దించిన 19 బస్తాల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 24 క్వింటాళ్ల బెల్లం, 60 కిలోల పటిక, ఐదు లీటర్ల నాటుసారాను పట్టుకున్నారు. వీర్యానాయక్‌తండాకు చెందిన గుగులోత్ అలేందర్‌ను అదుపులోకి తీసుకొని ట్రాక్టర్ సీజ్ చేశారు. ప్రధాన సూత్రధారి జాజిరెడ్డిగూడెం మండలం సూర్యానాయక్‌తండాకు చెందిన లునావత్ వెంకన్న, కర్రోనితండాకు చెందిన గుగులోత్ లింగ్యా పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ ఎస్సై గోపాల్ తెలిపారు. దాడుల్లో కానిస్టేబుళ్లు అఫ్సర్, ఆయూబ్, బ్రహ్మం, రమేష్, మనోహర్ పాల్గొన్నారు.


ఆత్మకూర్(ఎస్): కర్రోనితండాలో పట్టుకున్న నల్లబెల్లం ట్రాక్టరుతో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

నాటు వేసేందుకే మొగ్గు

జిల్లాలో డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతిపై రైతుల్లో నిరాసక్తి


ఆత్మకూర్(ఎస్): నెమ్మికల్‌లో నాటు వేసిన పొలం

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రధాన పంటగా వరిసాగు చేపడుతున్నారు. ఏటా పెట్టుబడులు పెరుగుతున్నా.. వరి వైపే అన్నదాతలు దృష్టి సారిస్తున్నారు. వివిధ పద్ధతుల ద్వారా సాగుకు పెట్టుబడులు తగ్గించే అవకాశం ఉన్నా.. రైతులు ఆ దిశగా మొగ్గు చూపడం లేదు. ప్రధానంగా నాట్లు వేసే సమయంలో కూలీల కొరత అధికంగా ఉండటంతో పాటు ఎకరాకు రూ.5 వేల వరకు కూలీలకే వెచ్చించాల్సిన పరిస్థితి. కూలీల సమస్యను అధిగమించేందుకు ప్రత్యామ్నాయంగా డ్రమ్ సీడర్, వెదజల్లు పద్ధతిని ఉపయోగించే అవకాశం ఉన్నా రైతులు ఆ దిశగా యోచన చేయడం లేదు. ఈ పద్ధతిపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాల్సి ఉన్నా.. పని ఒత్తిడి కారణంగా పట్టించుకోవడం లేదు. పంట దిగుబడి రాదేమోనని, చీడపీడల బెడద అధికంగా ఉంటుందని, అధిక పెట్టుబడికి వెనకాడకుండా నాటు వేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. వెదజల్లు, డ్రమ్ సీడర్ పద్ధతులపై అన్నదాతలు మొగ్గు చూపితే చాలా వరకు పెట్టుబడి తగ్గే అవకాశం ఉండటంతో పాటు దిగుబడి కూడా పెరుగుతోంది. ఈ విషయమై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

వెదజల్లు విధానంతో ప్రయోజనాలు:

- నాటు విధానం ద్వారా ఎకరాకు 25 కిలోల వరకు విత్తనాలు అవసరం. వెదజల్లు పద్ధతిలో 12 నుంచి 15 కిలోలు సరిపోతాయి.
- నాటు వేసేందుకు కూలీలకు ఎకరాకు రూ.5వేల వరకు ఖర్చు అవుతోంది. డ్రమ్ సీడర్, వెదజల్లు ద్వారా అయితే కేవలం రూ.500 మాత్రమే అవుతాయి.
- నారు పెంచి తిరగ నాటడం వల్ల వేర్లు తెగడంతో పిలకలు తక్కువగా వస్తాయి. వెదజల్లే పద్ధతిలో నేరుగా పెరగడం వల్ల దుబ్బులు, కంకులు ఎక్కువ వస్తాయి. దిగుబడులు పెరుగుతాయి.
- వెదజల్లే పద్ధతి అవలంబిస్తే పంట ఆరంభంలో మందులతో కలుపు నివారించొచ్చు. పంట త్వరగా కోతకు వస్తుంది.

లక్షన్నర ఎకరాల్లోపే..

జిల్లాలో ఈ వానాకాలం ఆయకట్టు, ఆయకట్టేతర ప్రాంతాల్లో 4,46,652 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. కాగా డ్రమ్ సీడర్, వెదజల్లు పద్ధతి ద్వారా కేవలం లక్షన్నర లోపే ఎకరాల్లో మాత్రమే చేపట్టడం గమనార్హం. సంప్రదాయ పద్ధతిలో నాటు వేయడంతో ఎకరాకు రూ.6 వేల వరకు ఖర్చు అవుతోంది. డీజిల్, ఎరువుల ధరలు పెరగడంతో అదనంగా మరో రూ.3 వేల భారం పడుతోంది. మొత్తమ్మీద ఎకరాకు రూ.25 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. దిగుబడి ఆశాజనకంగా ఉంటే రూ.40 వేల వరకు రాబడి వస్తోంది. చీడ పీడలు, వర్ష ప్రభావం ఎక్కువ ఉన్నా.. తక్కువ ఉన్నా దిగుబడి పూర్తిగా తగ్గే అవకాశం ఉంటుంది. దీంతో పెట్టుబడులు అధికమయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే వెదజల్లు, డ్రమ్ సీడర్ విధానాన్ని అవలంబిస్తే రైతులకు చాలా వరకు ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది.

దృష్టి సారించాలి

శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, సూర్యాపేట

వెదజల్లు, డ్రమ్ సీడర్ విధానంపై రైతులు దృష్టి సారించాలి. పంటకు పెట్టుబడి చాలా వరకు తగ్గుతోంది. దిగుబడిపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రుణమాఫీ, పంట లెక్క వేసే మండల అధికారులు నిమగ్నం కావడంతో అవగాహన కల్పించే సమయం లేదు. యాసంగిలో ఈ విధానంపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తాం.

విద్యార్థుల్లో ఆంగ్ల సామర్థ్యాలు పెంపొందించండి: కలెక్టర్

చివ్వెంల, న్యూస్‌టుడే: ఆంగ్ల భాష నేర్చుకోవడంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న భయాలను పోగొట్టాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. చివ్వెంల మండలం బీబీగూడెంలో నిర్వహిస్తున్న ఐదు మండలాల డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల జాలి ఫోనిక్స్ శిక్షణ కార్యక్రమంలో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న మెలకువలను ఉపాధ్యాయులు తరగతి గదిలో అమలుపరచాలని, ఇంగ్లిష్ పదజాలం, మాతృభాషలో దాని అర్థాన్ని విద్యార్థులకు వివరించాలన్నారు. ఉచ్ఛారణ, ఫోనిక్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించాలని సూచించారు. ఆంగ్ల భాషలో ఉన్న విషయాన్ని తెలుగులోకి, మాతృభాషలో ఉన్న విషయాన్ని ఇంగ్లిష్‌లోకి అనువాదం చేయగల సామర్థ్యాలు పిల్లలకు రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.అశోక్, క్వాలిటీ కోఆర్డినేటర్ జనార్దన్, కోర్సు కోఆర్డినేటర్ కె.గోపాలరావు, జాలిఫోనిక్స్ రిసోర్స్ పర్సన్లు డా.ఎస్వీ గోమతి, హర్షభాన్సలి పాల్గొన్నారు.


బీబీగూడెంలో ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


పెన్‌పహాడ్‌లో వరిపొలాన్ని పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి

వరిలో కాండం తొలుచు పురుగు బెడద: డీఏవో

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: నిపుణుల సలహాలు, సూచనలు పాటించి పంటలను సంరక్షించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. పెన్‌పహాడ్‌లో ఎర్రబోయిన సైదులు సాగుచేసిన వరిపొలాన్ని మంగళవారం పరిశీలించి రైతులకు సూచనలందించారు. వరిలో ఆకు, కాండం తొలుచు పురుగు, దోమకాటు సమస్య ఉందని గుర్తించి నివారణకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ముందు జాగ్రత్తలు పాటించి నాణ్యమైన అధిక పంట దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏవో అనిల్‌కుమార్, ఏఈవోలు సంధ్య, రాకేశ్, రైతులు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అరగంటలో.. చలో ఖమ్మం


పూర్తయిన రహదారి

కోదాడ (సాలార్జంగ్‌పేట), న్యూస్‌టుడే: కోదాడ చుట్టుపక్కల వారు ఖమ్మం నగరానికి నిత్యం వెళ్తుంటారు. ఆస్పత్రులకు, మార్కెట్లకు, కళాశాలలకు, ఉద్యోగ రీత్యా ఈ ప్రాంతం నుంచి ఎక్కువ మంది ప్రయాణిస్తుంటారు. గతంలో కోదాడ నుంచి ఖమ్మం జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే నరకప్రాయంగా ఉండేది. గంటకు పైగా సమయం పట్టేది. ఇరుకు రహదారి కావడంతో భయపడుతూ ప్రయాణించాల్సిందే. ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయి. కానీ ఇప్పుడు ఏకంగా నాలుగు వరుసల రహదారి నిర్మాణం పూర్తయింది. ఖమ్మం వెళ్లాలంటే అరగంట ప్రయాణమే పడుతోందని ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రహదారి నిర్మాణ దూరం: 31.800 కి.మీ.

వ్యయం: రూ. 1,039 కోట్లు | **నిర్వహణ కాలం: 15 ఏళ్లు**

తగ్గనున్న ప్రమాదాలు..

ఈ రహదారి కోదాడ నియోజకవర్గంలో 10 కిలో మీటర్ల పొడవు విస్తరించి ఉంది. పట్టణంలోని దుర్గాపురం స్టేజీ వద్ద విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి ప్రారంభమై అనంతగిరి మండలంలోని శాంతినగర్ గ్రామ పరిధిలో గల పాలేరు వాగు వరకు కోదాడ పరిధిలో ఉంది. మిగతా 21.800 కి.మీ. ఖమ్మం జిల్లాలో ఉంది. ఈ రహదారి నిర్మాణం 2023 జనవరి నాటికే పూర్తి కావాల్సి ఉండగా, పనులు ఆలస్యంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేట, కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, మహబూబ్‌నగర్ జిల్లా వాసులకు కూడా ఖమ్మం వెళ్లేందుకు ఈ రహదారి ఉపయోగపడుతుంది. వాహనాలను నూతన రహదారి మీదకు అనుమతించామని ఇటీవల అధికారులు తెలిపారు.

వాహనాన్ని నడపడం సులభంగా ఉంది:

పర్వతం శ్రీను, ట్రాలీ డ్రైవర్, కోదాడ



ట్రాలీ వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్నాను. నిత్యం ఖమ్మం నుంచి కోదాడకు తిరుగుతుంటాను. ఏమైనా సరకులు తీసుకొని వెళ్లేటప్పుడు గతంలో ఇబ్బందిగా ఉండేది. ఇరుకుగా, గుంతలుగా రోడ్డు ఉండటంతో భయమేసేది. ఇప్పుడు నాలుగు వరుసల నిర్మాణం పూర్తి కావడంతో సులభంగా వాహనాన్ని నడుపుతున్నాను.


భావిపౌరులు... బలహీనమై..!

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే:

యాంత్రిక జీవన విధానంలో పడి తల్లిదండ్రులు పిల్లలకు సరైన పోషణ అందుతుందో, లేదో కూడా పట్టించుకోలేకపోతున్నారు. వెరసి చిన్నారుల వయసుకు తగ్గట్టుగా పోషకాలు అందడంలేదు. పట్టుమని 10 శాతం పిల్లలు కూడా పూర్తి పోషణతో ఉండడంలేదన్నది సర్వేలు చెబుతున్న వాస్తవం. ప్రధానంగా విటమిన్ ఎ, డి, ఐరన్ లోపంతో ఎక్కువగా బాధపడుతున్నారని కేంద్ర కుటుంబ, ఆరోగ్య మంత్రిత్వ శాఖ సర్వే నివేదిక పేర్కొంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరును 'పోషణ అభియాన్ మాసం'గా గుర్తించి అవగాహన కల్పిస్తుంది.

☛ అడవిదేవులపల్లి పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థి సాయంత్రం 4 గంటల తర్వాత కళ్లు తిరిగి కింద పడిపోయాడు. తల్లిదండ్రులు వైద్యం కోసం తీసుకెళితే..అబ్బాయి చాలా బలహీనంగా ఉన్నాడని.. రోజూ పోషకాలతో కూడిన భోజనం అందించాలని సూచించారు.

☛ మిర్యాలగూడ పట్టణానికి చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలిద్దరూ రోజూ నీరసంగా ఉంటున్నారని వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. పిల్లలు రోజూ కాళ్లు, చేతులు లాగుతున్నాయంటున్నారని.. వారికి ఏదైనా టానిక్ రాసివ్వండని అడిగారు. ప్రస్తుతం ఇలాంటి ఘటనలు వైద్యుల వద్ద సాధారణమైపోయాయి.



అడవిదేవులపల్లిలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థినులు (పాత చిత్రం)

రోజూ భోజనంలో ఇవి తప్పనిసరి

- పసుపు, నారింజరంగు కూరగాయలు, ఆకుకూరలు
- గుడ్లు లేదా మాంసం
- పాలు, రాగి జావ
- తాజా పండ్లు, మొలకెత్తిన విత్తనాలు, డ్రైఫ్రూట్స్

సరైన పోషణ అందకపోతే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా **3,209** ప్రభుత్వ పాఠశాలల్లో **2,11,009** మంది విద్యార్థులు చదువుతున్నారు.

మూడో వంతు **70,336** మంది చిన్నారులు రక్తహీనతతో బాధపడుతున్నారు.

విటమిన్ లోపంతో **30000** మందిని కంటి సమస్యలు బాధిస్తున్నాయి.

రక్తహీనత కారణంగా నీరసం, తరచూ జ్వరంతో బాధపడుతూ చిగుళ్లవాపు, ఎముకల నొప్పుల వంటి సమస్యలు వేధిస్తున్నాయి. పాఠ్యాంశాలపై శ్రద్ధ చూపలేకపోతున్నారు.

వీరికి సరైన పోషకాలతో కూడిన ఆహారం అందించడం తల్లిదండ్రుల బాధ్యత.

వయసుల వారీగా పిల్లలకు కావాల్సిన పోషకాలు (గ్రాముల్లో)

వయసు	ప్రొటీన్లు	కొవ్వులు	కాల్షియం	ఐరన్(మి.గ్రా.)	క్యాలరీలు(శక్తి)
2-3	17.7	27	0.6	9	1,060
4-6	20.1	25	0.6	13	1,350
7-9	29.5	30	0.6	16	1,690
10-12	39.9	35	0.8	21	2,190
13-15	54.3	45	0.8	28	2,750

సమతుల ఆహారమందించాలి..: ఎస్‌డీ.అజహర్ అహ్మద్, ఎంవో, పీహెచ్‌సీ, అడవిదేవులపల్లి



పిల్లలకు ఇచ్చే ఆహారంలో కార్బోహైడ్రేట్లు 60 శాతం, పిండిపదార్థాలు 10 శాతం, కొవ్వు 30 శాతం పదార్థాలతో పాటు పీచు పదార్థాలు, విటమిన్లు ఉండే ఆకు కూరలతో కూడిన సమతుల ఆహారం ఇవ్వాలి. అరికెలు, సామలు, కొర్రలు, రాగులు వంటి చిరుధాన్యాలను అలవాటు చేయాలి.



ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్న దృశ్యం

వేరుసెనగ వైపు అడుగులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: యాసంగిలో వేరుసెనగ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ సారి వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ఆయకట్టేతర ప్రాంతాల్లో వరినాట్లు వేయలేకపోయారు. ఆగస్టు చివరి నుంచి కురిసిన వానలకు జల వనరులు కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉంది. దీంతో మరో పది రోజుల్లో వేరుసెనగ సాగు పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. బీడు భూముల్లో చెత్తాచెదారం తొలగించి దుక్కులు దున్నుతున్నారు.

200 క్వింటాళ్ల విత్తనాలు విక్రయం

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 200 క్వింటాళ్ల వేరుసెనగ విత్తనాలు విక్రయించారు. విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలు దొరకని రైతులు బయటి మార్కెట్‌లో సేకరించుకుంటున్నారు. ఎకరా సాగుకు సుమారు 80 నుంచి 85 కిలోల పల్లీవిత్తనాలు అవసరం. ప్రభుత్వం ఐదేళ్లుగా రాయితీ ఇవ్వకపోవడంతో రైతులకు విత్తన పెట్టుబడి భారంగా మారింది.

ఉమ్మడి జిల్లాలో 13,500 ఎకరాల్లో..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో యాసంగిలో 13,500 ఎకరాల్లో వేరుసెనగ సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. నల్గొండ జిల్లాలో ఎక్కువగా దేవరకొండ, డిండి, మర్రిగూడ, గుర్రంపోడు, నల్గొండ, పెద్దవూర, పీఏపల్లి, చింతపల్లి, గుండ్లపల్లి మండలాల్లో ఎక్కువగా సాగవుతుందని భావిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో తిరుమలగిరి, ఆత్మకూర్(ఎస్), తుంగతుర్తి, మోతె, నాగారం, నూతనకల్ మండలాల్లో పల్లీలు పండించనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎక్కువ మండలాల్లో వేరుసెనగ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

పల్లీ సాగుకు అనుకూలం: శ్రవణ్‌కుమార్ జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

యాసంగిలో ఇప్పుడు వేరుసెనగ సాగుకు అనుకూలంగా ఉంది. వర్షాలు కురవడంతో భూముల్లో తడి ఉంది. సాగు పనులకు రైతులు సమాయత్తం కావచ్చు. నల్గొండ జిల్లాలో ఎక్కువగా దేవరకొండ డివిజన్‌లో పల్లీలు సాగు చేస్తారు.

జీవితానికి 'మరమ్మతులు' చేసుకొని..!



మిర్యాలగూడ సబ్ జైలు డిప్యూటీ జైలర్ విష్ణువర్ధన్‌రెడ్డి

తపన ఉండాలే కానీ ఏదైనా సాధించవచ్చని..వాటికెన్ని అడ్డంకులు ఎదురైనా పోరాటం చేయవచ్చని నిరూపించారు మిర్యాలగూడ సబ్‌జైలు డిప్యూటీ జైలర్ బుర్రి విష్ణువర్ధన్‌రెడ్డి. చదివేందుకు ఫీజులు చెల్లించే స్తోమత లేక ఇంటర్మీడియట్‌తోనే చదువు మానేసి.. పదేళ్లపాటు బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ.. దూరవిద్యలో మళ్లీ చదువును కొనసాగించి.. పోటీపరీక్షలు రాసి ఒకేసారి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ జైలర్. తన ప్రయాణం గురించి ఆయన వివరించారు.. 'మాది మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని వేములపల్లి మండల కేంద్రం. అమ్మానాన్న జానకిరెడ్డి, అహల్య. ఇంటర్మీడియట్ వరకూ మిర్యాలగూడలోనే చదివి.. అనంతరం హైదరాబాద్‌లో ద్విచక్రవాహన మరమ్మతుల దుకాణంలో చేరా. మెకానిక్ పని చేసుకుంటూనే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దూర విద్య ద్వారా డిగ్రీ పూర్తి చేశా. ఐసెట్‌లో సీటు సాధించి ఎంబీఏ 2013లో పూర్తి చేశాను. 2005 నుంచి 2015 వరకు బైక్ మెకానిక్‌గా పనిచేసినా.. స్నేహితుడి సాయంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. మొదటి ప్రయత్నంలో ఎస్సై పరీక్ష రాయగా ఎంపికవలేదు. ఆ తరువాత నిర్ణీత ప్రణాళికతో కష్టపడి పలు పోటీ పరీక్షలు రాయటంతో పంచాయతీ కార్యదర్శి పరీక్షలో 74వ ర్యాంకు, గ్రూప్-4లో 63వ ర్యాంకు, బిల్‌కలెక్టర్ ఉద్యోగం, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించా. పంచాయతీ కార్యదర్శి ఉద్యోగంలో చేరి వేములపల్లి మండలం ఇసుకబాయిగూడెంలో 2019లో విధుల్లో చేరా. కొద్దిరోజులకే డిప్యూటీ జైలర్‌గా ఎంపికయ్యా. తమిళనాడులో శిక్షణ అనంతరం చంచల్‌గూడ, చర్లపల్లి కారాగారాల్లో విధులు నిర్వర్తించి ఇటీవల మిర్యాలగూడకు బదిలీపై వచ్చా. ప్రస్తుతం గ్రూప్-1 పరీక్షలకు సైతం సిద్ధమవుతున్నా.'..అని వివరించారు.

- మిర్యాలగూడ, న్యూస్‌టుడే

దోపిడీ దొంగల ముఠా అరెస్టు

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు శివారులోని వెల్లటూరు కాలనీలో బ్రిక్స్ వ్యాపారి తమ్మిశెట్టి వెంకయ్య ఇంట్లో ఈ నెల 19వ తేదీ తెల్లవారుజామున దోపిడీకి పాల్పడిన దొంగల ముఠాలోని ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. నిందితుల నుంచి ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, రూ.38 వేల నగదు, నేరానికి వినియోగించిన కారుతోపాటు ఐదు చరవాణిలు, ఇతర మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వేమవరపు నాగరాజు, వేమవరపు పుల్లారావు, భిక్షాలు, నల్గొండ జిల్లా వాసి రమావత్ మాత్య, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన చిక్కల ఆంజనేయులు, మేళ్లచెరువుకు చెందిన వేముల వెంకటేశ్వర్లు మొత్తం ఆరుగురు ఒక ముఠాగా ఏర్పడి ఈ నెల 19న వెల్లటూరులోని బ్రిక్స్ వ్యాపారి ఇంటి తలుపులు ధ్వంసం చేసి



కీలక సమాచారం అందించిన ఆటో డ్రైవర్ తిరుపతయ్యను అభినందిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, చిత్రంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, తదితరులు

లోనికి ప్రవేశించారు. కత్తులతో బెదిరించి వ్యాపారి వెంకయ్య, అతని ఇద్దరు కుమార్తెలను బెదిరించి వారి ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలతోపాటు రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఏడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. కోదాడ గ్రామీణ సీఐ రజితారెడ్డి తన సిబ్బందితో అనంతగిరి మండలం శాంతినగర్ వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఐదుగురు వ్యక్తులు కారులో వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. విచారించడంతో వెల్లటూరుతో దోపిడీకి పాల్పడినట్లు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. వేముల వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నాడు. ఈ కేసులో కీలక సమాచారం అందించిన ఆటో డ్రైవర్ తిరుపతయ్యను ఎస్పీ సన్మానించారు. కేసు ఛేదనకు కృషిచేసిన అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ రజితారెడ్డి, మేళ్లచెరువు, అనంతగిరి, కోదాడ గ్రామీణ, చింతలపాలెం ఎస్సైలు పరమేశ్, నవీన్, అనిల్ రెడ్డి, సైదిరెడ్డి, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



త్రిపురం సతీష్‌రెడ్డి

మఠంపల్లి, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో యువ రైతు ప్రాణాలు కోల్పోయిన ఘటన మఠంపల్లి మండలం రఘునాథపాలెంలో మంగళవారం జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపల్లికి చెందిన త్రిపురం సతీష్‌రెడ్డి(36) గత కొన్నేళ్లుగా ఇక్కడ వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని పత్తి సాగు చేసుకుంటూ కుటుంబంతో ఉంటున్నారు. మధ్యాహ్నం వరకు గొర్రు దున్ని మోటారు వేసేందుకు వెళ్లిన సతీష్‌రెడ్డి స్టార్టర్ వద్ద సగానికి పైగా తెగి ఉన్న తీగను సరిచేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను చికిత్స కోసం హుజూర్‌నగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. స్వగ్రామంలో సొంత భూమి లేకపోవడంతో బతుకుదెరువు కోసం ఐదేళ్ల క్రితం ఈ గ్రామానికి వచ్చిన సతీష్‌రెడ్డికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామాంజనేయులు తెలిపారు.

భార్య చేతిలో భర్త హతం

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడన్న కారణంతో భర్తను భార్య హతమార్చిన ఘటన సూర్యాపేట మండలంలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం హనుమానాయక్ తండాకు చెందిన ధరావత్ కౌసల్య కొంతకాలంగా మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్త ధరావత్ సైదా(45) అడ్డు తొలగించుకోవాలని ఈ నెల 17వ తేదీ రాత్రి సమయంలో అతని కణతపై గొడ్డలితో గాయపరిచి హత్య చేసింది. మద్యం మత్తులో తూలి చెక్క బల్ల అంచుపై పడి తీవ్రంగా గాయపడి మృతిచెందినట్లు అందరినీ నమ్మించింది. ఈ హత్యను చిన్న కుమారుడు వినోద్ చూడగా అతడిని బతిమిలాడి బయటకు చెప్పకుండా జాగ్రత్త పడింది. మరుసటి రోజు మృతుడికి అంత్యక్రియలు పూర్తి చేశారు. చిన్నకుమారుడు వినోద్ తల్లితో గొడవపడి విషయాన్ని తన సోదరుడు సాయికుమార్‌కు చెప్పాడు. సాయికుమార్ ఫిర్యాదు మేరకు గ్రామీణ ఎస్సై బాలునాయక్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు మంగళవారం ధరావత్ కౌసల్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గ్రామీణ సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.



మిలమిల మెరిసిన తారు

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిలో కోదాడ పట్టణంలోని దుర్గాపురం స్టేజీ వద్ద ఏర్పాటైన ఖమ్మం వెళ్లే నూతన రహదారి ఇలా వెలిగిపోతూ కనిపించింది.

- న్యూస్‌టుడే, కోదాడ

ఇక ఆరోగ్య యోగం

నకిరేకల్, న్యూస్‌టుడే: ఉరుకులు.. పరుగుల దైనందిన జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రాధాన్యం పెరుగుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు ఉపయోగపడే యోగాను ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు కొలిక్కివచ్చాయి. ఆయుష్ కేంద్రాలకు అనుబంధంగా గతేడాది జిల్లాలో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్లు (ఆరోగ్య స్వస్థత యోగా మందిర్‌లు) తాజాగా సేవలు ప్రారంభించేందుకు కసరత్తు మొదలైంది. వీటిల్లో యోగా శిక్షకుల నియామకానికి ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నెలాఖరుకు నియామకాల ప్రక్రియను పూర్తిచేసే యోచనలో అధికారులున్నారు.



నకిరేకల్‌లో ప్రాంతీయ వైద్యశాల ఆవరణలో ఏడాదిన్నర క్రితం నిర్మించిన ఆయుష్ యోగా మందిర్

మందిర్‌లు ఇలా..

ఉమ్మడి జిల్లాలో ఆయుష్ వైద్య కేంద్రాల్లో ప్రభుత్వం 47 వెల్‌నెస్ సెంటర్ల భవనాలు నిర్మించింది. వీటికి జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా రూ.2.70 కోట్లను వ్యయం చేసింది. ఈ నిధులతో యోగా కేంద్రాల నిర్మాణం చేపట్టారు. గాలి, వెలుతురు వచ్చే విధంగా వీటి నిర్మాణాలున్నాయి.

శిక్షణా తరగతులు...

ఆయుష్ యోగా మందిరాల్లో ఇద్దరు శిక్షకులను ఒక పురుషుడు, మహిళను నియమిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 47 యోగా మందిర్‌లకు 97 మంది శిక్షకులను నియమించనున్నారు. యోగా ధ్రువపత్రాలున్న పురుషునికి నెలకు రూ.8 వేలు, మహిళకు రూ.5 వేల గౌరవ వేతనంతో ఒప్పంద ప్రతిపాదికన శిక్షకులుగా నియమిస్తున్నారు. ఎంపికైన శిక్షకులు(పురుషులు) ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, మహిళలు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. యోగా కేంద్రాలకు వచ్చే స్థానికులకు ఉచితంగా యోగాసనాలు నేర్పించాలి. ఆయుష్ వైద్యులు ప్రజలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

ఉమ్మడి జిల్లాలో మందిరాలు ఇలా..

★ నల్గొండ: 21 మందిరాలు: శిక్షకుల సంఖ్య: 42

★ సూర్యాపేట: 12 మందిరాలు: శిక్షకుల సంఖ్య 24

★ యాదాద్రి : 14 మందిరాలు: శిక్షకుల సంఖ్య: 28

27న ఇంటర్వ్యూలు..

యోగా శిక్షకుల నియామకాల కోసం ఈ నెల 27న నల్గొండలోని ఆయుష్ వైద్యశాల ఆధ్వర్యంలో వాక్- ఇన్- ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాకు చెందిన వారు నల్గొండలోనే ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సి ఉంటుంది. ఇంటర్‌పూర్తిచేసి, యోగా ధ్రువపత్రాలు కలిగిన వాళ్లు అర్హులని ఆయుష్ జిల్లా సీనియర్ వైద్యాధికారి డా.నర్సింహరావు తెలిపారు.



సోమ బ్రహ్మాచారి

ఆయనో బ్రహ్మ..!

ఆయన ఉలి పడితే.. ఎంతటి నిర్జీవమైన వస్తువులైనా జీవం పోసుకుంటాయి.. చదువు పెద్దగా లేకపోయినా.. కొద్దిగా నైపుణ్యం.. చేసే పనిపై మనసు.. దానికి నిరంతర శ్రమ తోడైతే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారు ముంజంపల్లి సోమబ్రహ్మాచారి.

★ చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామ పంచాయతీ వెంకటేశ్వరనగర్‌కు చెందిన ఈయన.. ఆలయాలకు కావాల్సిన దేవుళ్ల విగ్రహాలను తయారు చేయడంతో పాటు రేగు గింజ సైజులో వివిధ రూపాలను చెక్కుతూ ప్రతిభను



ఆయన చెక్కిన రూపాలు

చూపుతున్నారు. బాల్యం నుంచి చిత్రకళపై ఆసక్తిని పెంచుకొని గ్రామంలోనే నిత్య సాధనతో ప్రావీణ్యం పొందుతున్నారు.

★ తాను ఊహించుకున్న రూపాన్ని చేతులతో వస్తువులుగా తీర్చిదిద్దుకున్నారు. ఇత్తడి, రాగి విగ్రహాలతోపాటు శిల్పాలు, ఆలయ ధ్వజ స్తంభాలు, శిఖర కలశాలు, ముఖ తోరణాలు, విగ్రహ కవచాలు, కిరీటాలు, రాగి యంత్రాలు, దర్గాలకు, మొహర్రానికి సంబంధించి ఆభరణాలు తదితర వస్తువులను ఆయన సులువుగా తయారు చేయడంలో దిట్ట. ఈయన చేసినవి పలు విగ్రహాలు రాష్ట్రంలోని ఆయా దేవాలయాల్లో కనిపిస్తాయి.

ప్రత్యేకతలు..

★ ఏపీలోని ప్రముఖ క్షేత్రమైన విజయవాడ కనకదుర్గ ఆలయానికి కిలో వెండితో నవరత్న కిరీటం. ప్రకాశం జిల్లాలోని బైరవకొన త్రిముఖ దుర్గ ఆలయానికి విగ్రహం. చింతపల్లిలోని శిర్డీ సాయిబాబా దేవాలయానికి కిరీటం. రంగారెడ్డి జిల్లా కందుకూరులో మేరిమాతకు వెండి కిరీటం, వెంకటేశ్వరనగర్‌లోని పలు దేవాలయాలకు శివ కవచం ప్రత్యేకంగా తయారు చేసి అందించారు. రేగు గింజ సైజులో ఉన్న వాటిపై ఓ వైపు గణపతి, మరోవైపు లక్ష్మీదేవి విగ్రహాలను చెక్కి పలు దేవాలయాల్లోని విగ్రహాలకు జీవం పోశారు.

- న్యూస్‌టుడే, చింతపల్లి

ఇరువర్గాలకు చెందిన ఎనిమిది మందికి రిమాండ్

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: యాదాద్రి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో కత్తులతో ఓ వర్గం వారు దాడి చేయగా.. మరో వర్గం ప్రతిదాడి చేసిన ఘటనలో మొత్తం ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్, భగత్‌సింగ్ నగర్‌కు చెందిన ఫర్హాన్, మహ్మద్ షారుఖ్, మహ్మద్ ఖాజా, మినాజ్, అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన అమీర్‌లు కలిసి చౌటుప్పల్ పురపాలిక పరిధిలోని తంగడపల్లికి చెందిన షేక్ నుమాన్‌ని కలవడానికి వచ్చారు. అందరూ కలిసి మద్యం తాగారు. తాగిన మైకంలో కారును దురుసుగా నడుపుతుండటంతో ఎందుకు ఇలా చేస్తున్నారని ప్రశ్నించినందుకు కత్తులతో పొడిచి దాడి చేశారని సుర్కంటి సుధాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దాడిలో కుమారుడు బాలకృష్ణారెడ్డితో పాటు కౌన్సిలర్ హిమబిందు భర్త దండ అరుణ్‌కుమార్, సుర్వి మహేందర్‌లు తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. కాగా.. కారును వేగంగా నడుపుతున్నారని తమని దుర్భాషలాడుతూ దండ అరుణ్‌కుమార్, సుర్కంటి బాలకృష్ణారెడ్డి, సుర్వి మహేందర్‌తో పాటు మరికొంత మంది తమపై దాడి చేశారని తంగడపల్లికి చెందిన నుమాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించి చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. కత్తులతో దాడి చేసిన ఘటనలో.. షేక్ నుమాన్, మహ్మద్ షారుఖ్, మహ్మద్ ఖాజా, మహ్మద్ మినాజ్‌లను.. దురుసుగా డ్రైవింగ్ చేశారని కారులోని వ్యక్తులను చితకబాదినందుకు చౌటుప్పల్‌కు చెందిన మలిగె నవీన్, మలిగె సంతోష్, మలిగె రవి, మలిగె మహేశ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెల్లడించారు.

దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన డీసీపీ

చౌటుప్పల్‌లో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన దాడి ఘటన నేపథ్యంలో డీసీపీ రాజేశ్‌చంద్ర పరిశీలించారు. మంగళవారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌ను డీసీపీ సందర్శించారు. ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్, ఎస్సైలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతలకు ఆటంకం లేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125-00
రిటైల్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

నేరేడుచర్ల, న్యూస్‌టుడే:

? నేరేడుచర్ల పురపాలికలో ప్రజాపాలనలో ఉచిత విద్యుత్తు, గ్యాస్ రాయితీ, ఇల్లు తదితరాలకు దరఖాస్తు చేసుకున్నాను. నా దరఖాస్తు నెంబర్ 15/28. కాని నా దరఖాస్తు పోర్టల్‌లో చూపించటం లేదు. దీనివల్ల నాకు ఏ రాయితీ అందటం లేదు. – బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, నేరేడుచర్ల

✔ దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. కాని పోర్టల్‌లో చూపించడం లేదు. మళ్లీ నమోదు చేయాలంటే ప్రభుత్వం ఆప్షన్ ఇవ్వాలి. ఆప్షన్ ఇవ్వగానే నమోదు చేస్తాం. – అశోక్‌రెడ్డి, పుర కమిషనర్, నేరేడుచర్ల

అభయాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మారుతిప్రసాద్

చిలుకూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కాలువ ఒడ్డున గల అభయాంజనేయస్వామి దేవాలయంలో గ్రామానికి చెందిన బాలెబోయిన పవన్‌కుమార్(పిచ్చయ్య) దంపతుల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మారుతిప్రసాద్ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

మంత్రి ఉత్తమ్‌కు వినతుల వెల్లువ



సాగర్ ఎడమ కాల్వ గండి వద్ద ఇసుక బస్తాలపై కూర్చొని పనులు పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్

నడిగూడెం, న్యూస్‌టుడే: కాగితరామచంద్రాపురం వద్ద ఎడమ కాల్వ గండి పూడ్చివేత పనులను పరిశీలించడానికి వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్థానికులు పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. గండి వల్ల ఇసుక మేట వేసిన పంట పొలాలను బాగు చేసుకునేందుకు ప్రభుత్వం నుంచి సాయం అందించాలని బాధిత రైతులు మంత్రికి విన్నవించారు. నడిగూడెం నుంచి కాగిత రామచంద్రాపురం మీదుగా ఖమ్మం జిల్లా నాయకన్‌గూడెం వరకు రెండువరుసల రహదారి నిర్మాణ పనులకు రూ.20 కోట్లు మంజూరై ఆరు నెలలు దాటినా నేటికీ పనులు ప్రారంభించలేదని గ్రామస్థులు మంత్రికి వినతి పత్రం అందజేశారు. గండి వల్ల పంట పొలాలు నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు చేయాలని విన్నవించారు.

కోదాడ: మాజీ సర్పంచి పార సీతయ్య నివాసానికి ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మంగళవారం వెళ్లగా అఖిల కార్యకర్తగా గెలిచిన ఉత్తమ్ దంపతుల చిత్రపటాన్ని అందించారు. అనంతరం బాలికల పాఠశాలలో పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా, వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

నాణ్యత లేమి.. పనులు అసంపూర్తి

మండలం	పనులు జరుగుతున్న పాఠశాలల సంఖ్య
కోదాడ	38
మునగాల	24
నడిగూడెం	20
అనంతగిరి	21
చిలుకూరు	18

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట అభివృద్ధి పనులు చేపట్టింది. ఈ పనులు అనుకున్న సమయంలో పూర్తి కాకపోవడమే కాకుండా పనుల్లో నాణ్యత లోపిస్తోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇష్టారాజ్యంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం ఇసుక, సిమెంట్ వాడటంలేదనే విమర్శలు వస్తున్నాయి. పనులకు సిమెంట్, ఇసుక బదులు ఎక్కువ శాతం డస్ట్, కంకర వాడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. – కోదాడ, న్యూస్‌టుడే:

12 పాఠశాలల్లో..

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 121 పాఠశాలలు ఎంపిక కాగా వాటిలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మరుగుదొడ్లు, సింకులు, ఫ్యాన్లు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తారు. ఒక్కో పాఠశాలకు 1,30,000 నుంచి 1,50,000 వరకు నిధులు కేటాయించారు. ఐదు మండలాల్లో సుమారు రూ.2.34 కోట్లు ఖర్చుతో పనులు జరుగుతున్నాయి. 60 శాతం పనులు పూర్తి అయ్యాయని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. అమ్మ ఆదర్శ కమిటీలు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి.

త్వరలోనే పర్యవేక్షిస్తాం:

– ఓబులేష్, హౌసింగ్ ఏఈ, కోదాడ

కొన్ని పాఠశాలల పనుల్లో నాణ్యత లేదని మా దృష్టికి వచ్చింది. త్వరలోనే వాటిని పర్యవేక్షిస్తాం. నిర్మాణ పనుల్లో సిమెంట్, ఇసుక ఎక్కువగా వాడాల్సి ఉంటుంది. డస్ట్ ఎక్కువగా వాడితే నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తుంది.

వరద బాధితులకు రూ.5 లక్షలు సాయం

కోదాడ, న్యూస్‌టుడే: వరద బాధితులకు కోదాడ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.5 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, జయప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యేకి అందజేస్తున్న మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు

★ పట్టణంలోని 15వ వార్డు కౌన్సిలర్ షఫీ ఏర్పాటు చేసిన నిత్యావసర వస్తువులను ఎమ్మెల్యే వరద బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ ఛైర్మన్ కోటేశ్వరరావు, రామారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

3 నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల విజయదుర్గ ఆలయంలో దాతల సహకారంతో దేవీ నవరాత్రి ఉత్సవాలు అక్టోబరు 3 నుంచి 13 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి కొణతం చిన్నవెంకటరెడ్డి తెలిపారు. విజయదుర్గ ఆలయకమిటీ ఛైర్మన్ కొణతం ఆదిరెడ్డి అధ్యక్షతన మంగళవారం ఉత్సవాల నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలపై జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయం నిర్మించి 12 సంవత్సరాల(పుష్కర కాలం) సందర్భంగా ఈసారి మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు చెప్పారు. పురవైస్‌ఛైర్మన్ ప్రకాశ్, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ సురేష్‌రెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ ప్రతినిధి చిన్నవెంకటరెడ్డి

దెబ్బతిన్న రోడ్డుపై నాట్లు వేసి నిరసన

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ వైపు నుంచి విజయదుర్గ గుడి వైపు వెళ్లే మట్టి రోడ్డు దెబ్బతిని కోతకు గురికావడం, నీటినిల్వ తో ఇబ్బంది పడుతున్న ఆ ప్రాంత ప్రజలు మంగళవారం రోడ్డుపై నీరు నిలిచి ఉన్న చోట నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. పురపాలిక ఛైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు పరిశీలించి తక్షణం ఈ రోడ్డును బాగు చేయాలని వారు డిమాండ్ చేశారు. మురుగు కాల్వలు సైతం లేక ఇబ్బంది పడుతున్నట్లు వారు పేర్కొన్నారు.



నిరసన తెలుపుతున్న స్థానికులు

పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేం

కోదాడ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఉదయం నాలుగు గంటల నుంచి ఇళ్లలో చెత్తను తరలిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేమని పుర ఛైర్‌పర్సన్ ప్రమీల అన్నారు. మంగళవారం పుర కార్యాలయంలో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిత్యం పట్టణం శుభ్రంగా ఉంచేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని వారి సేవలు కొనియాడారు. అనంతరం కార్మికులకు చేతులకు గ్లౌజులు, మాస్కులు, పని ప్రదేశంలో ధరించే కిట్‌ను అందజేశారు.



పారిశుద్ధ్య కార్మికులకు కిట్ అందజేస్తున్న పుర ఛైర్‌పర్సన్ ప్రమీల, కమిషనర్ రమాదేవి

ఎన్నిక

గరిడేపల్లి: టీఎస్ యూటీఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ రణబోతు రవీందర్ ఎన్నికల పరిశీలకునిగా ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షునిగా బానావత్ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జిన్నారెడ్డి వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులుగా రేణుక, కిషోర్‌బాబు, కోశాధికారిగా వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.



నాగేశ్వరరావు



వెంకటరెడ్డి

యువ మోర్చా సభ్యుడిగా కోదాడ వాసి

కోదాడ: భారతీయ జనతా యువ మోర్చా(బీజేవైఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కోదాడకు చెందిన రౌతు కల్యాణ్ నియమకం అయ్యారు. ఈ మేరకు మంగళవారం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కల్యాణ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.



రౌతు కల్యాణ్

జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం: సీపీఎం

మోతె, న్యూస్‌టుడే: ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం భారత దేశ ఫెడరల్ విధానానికి విఘాతం కలుగుతుందని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టి పెద్దిసైదులు అన్నారు. మండలంలోని మామిళ్లగూడెం, విభళాపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సీపీఎం గ్రామశాఖ మహాసభల్లో పాల్గొని మాట్లాడారు. ఈ విధానంతో జాతీయ పార్టీలు పాలించాల్సిన ప్రభుత్వాలు రెండు లేదా మూడేళ్లకాలం మాత్రమే పదవిలో ఉంటాయన్నారు. తద్వారా రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. మండల కార్యదర్శి గోపాల్‌రెడ్డి, షేక్ జానీమియా, మల్లయ్య, ఏసు, తదితరులు పాల్గొన్నారు.



మోతె: మామిళ్లగూడెంలో సీపీఎం మహాసభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సైదులు

అవగాహన కల్పిస్తూ.. శ్రమదానం చేయిస్తూ



హుజూర్‌నగర్: పారిశుద్ధ్య అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ వారితో శ్రమదానం చేయించి పరిసరాలను శుభ్రం చేసుకునేలా చేస్తూ పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు జరిగాయి.

మునగాల గ్రామీణం: కృష్ణానగర్, తాడ్వాయిలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్యశిబిరాలను పరిశీలించి మాట్లాడారు.

నేరేడుచర్ల: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలలో ముకుందాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, పాటలు, క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో డి.సోమసుందర్‌రెడ్డి పాఠశాలను సందర్శించగా తాము వేసిన స్వచ్ఛతకు సంబంధించిన చిత్రాలను ప్రదర్శించారు.

మునగాల: మునగాల, తిమ్మారెడ్డిగూడెం, నారాయణగూడెం, కొక్కిరేణి గ్రామాల్లో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు.



నేరేడుచర్ల: ముకుందాపురం ప్రాథమిక పాఠశాలలో తాము వేసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

సంక్షిప్త సమాచారం

జయప్రదం చేయాలి.. కోదాడ గ్రామీణం: సూర్యాపేటలో ఈనెల 29, 30న జరిగే టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గుడిబండ, తొగర్రాయి, కూచిపూడి, గణపవరంలో మంగళవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు.

వితరణ.. కోదాడ గ్రామీణం: మండల పరిధిలోని బాలిపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం కాసాని వెంకటేశ్వర్లు రూ.10 వేల విలువైన క్రీడా దుస్తులు, సామగ్రిని అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు ప్రభాకర్, సుధాకర్, శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్.. గరిడేపల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గానుగబండలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అనేక కొర్రీలు, వివరాలు, కుటుంబ నిర్ధారణ, నిబంధనలు అంటూ రుణమాఫీపై కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

సర్వసభ్య సమావేశం.. కోదాడ గ్రామీణం: మండల పరిధిలోని కాపుగల్లు ప్యాక్స్ సర్వసభ్య సమావేశం ఛైర్మన్ నంబూరి సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సంఘ ఆర్థిక స్థితిగతుల గురించి రైతులకు వివరించారు. వరప్రసాద్‌రెడ్డి, నరేష్, లక్ష్మణరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తనిఖీ.. కోదాడ గ్రామీణం: పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు అన్నారు. ఎర్రవరంలో ప్రాథమిక పశు వైద్యశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఉచిత కృత్రిమ గర్భధారణ పథకాన్ని పశుపోషకులు వినియోగించుకోవాలని సూచించారు. వైద్యులు మధు, శరత్, నాగలక్ష్మి, రామారావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం నుంచి తొలగింపు.. హుజూర్‌నగర్: దరణి ఉద్యోగుల సంఘం నుంచి దరణి ఆపరేటర్ పత్యావత్ జగదీష్‌ను బహిష్కరించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు చెన్నగాని పుర్షోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకరిద్దరు ఆపరేటర్లు చేసే తప్పులకు దరణి ఆపరేటర్లు అందరిని కించపరిచే విధంగా మాట్లాడటం, చూడటం సరైంది కాదన్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొనగాల మహేష్, ఆడేపు మేరెడ జగదీష్‌ను బహిష్కరించినట్లు చెప్పారు.

తొలగింపు.. హుజూర్‌నగర్: మురుగునీటితో నీరు కలుషితం కాకుండా పట్టణంలోని పెద్ద చెరువు వద్ద నిమజ్జన వ్యర్థాలను తొలగిస్తున్నట్లు పుర కమిషనర్ రమాదేవి అన్నారు. మంగళవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పెద్ద చెరువు, సమీప ప్రాంతాల్లో చెత్త, చెదారం తొలగించి మాట్లాడారు.

ఎండుతున్న పంటలు.. అనంతగిరి: వరదలు వచ్చి 20 రోజులవుతున్నా నేటికీ విద్యుత్ మరమ్మతులు పూర్తి కాకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు.

నియామకం.. కోదాడ గ్రామీణం: మండల పరిధిలోని యర్రవరం ప్యాక్స్ తాత్కాలిక సీఈవోగా మౌలాలి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

బాధ్యతలు.. నడిగూడెం: నడిగూడెం మండల విద్యాధికారిగా బి.ఉపేందర్‌రావును నియమిస్తూ విద్యాశాఖ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రామాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ, ప్రస్తుతం మండల నోడల్ అధికారిగా పనిచేస్తున్నారు. తాజాగా మండల విద్యాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పరిశీలన.. హుజూర్‌నగర్ గ్రామీణం: బూరుగడ్డ గ్రామంలో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు తెగిన చెరువు కట్ట పనులను కాంగ్రెస్ నాయకులు మంగళవారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో కట్ట పోయాలని సూచించారు. డీసీసీబీ మాజీ సభ్యులు సుబ్బారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ సర్పంచి అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ.. నడిగూడెం: పాఠశాలలు, ఉపాధ్యాయులు వివరాల నమోదుకోసం విద్యా శాఖ నూతనంగా తీసుకువచ్చిన ప్రశస్త యాప్‌లో వివరాలు నమోదు చేసే విధానంపై మంగళవారం నడిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో నోడల్ అధికారి బి.ఉపేందర్‌రావు అవగాహన కల్పించారు.

ఒప్పంద ఉద్యోగులకు న్యాయం చేయాలి

కోదాడ, న్యూస్‌టుడే: వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ముత్యాలు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఆయన కార్మికులతో కలిసి మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పూర్తి స్థాయిలో రద్దు చేసి వారికి న్యాయం చేయాలన్నారు. అనంతరం కోదాడ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీహర్షకు కార్మికులతో కలిసి మెమోరాండం అందజేశారు. సైదమ్మ, నాగమ్మ, వెంకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంట పొలాల పరిశీలన



సిరిపురం వద్ద పొలాలను పరిశీలిస్తున్న కోదాడ ఏడీఏ యల్లయ్య

నడిగూడెం, న్యూస్‌టుడే: సాగర్ ఎడమ కాల్వకు గండి పడి నీటి సరఫరా నిలిపివేయడంతో సాగులో ఉన్న పంటపొలాలు ఎండిపోయాయని ఆయకట్టు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కోదాడ వ్యవసాయ సహాయ సంచాలకుడు యల్లయ్య మంగళవారం సిరిపురం, చాకిరాల, కాగితరామచంద్రాపురం రెవెన్యూ పరిధిలో ఎండిన పంట పొలాలను పరిశీలించారు. రైతుల వివరాలు, సాగు చేసిన విస్తీర్ణం నీరందక ఎండిన కమతాలను నమోదు చేసి నివేదిక అందజేస్తామని తెలిపారు.

మునగాల: వరదలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు అన్నారు. సుందరయ్య భవనంలో మంగళవారం నిర్వహించిన సీపీఎం మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

వాహనదారుడిపై దాడి చేసి.. నగదు ఎత్తుకెళ్లి

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న-కల్లూరు మధ్య ద్విచక్ర వాహనంపై వెళుతున్న నేరేడుచర్ల పురపాలిక పరిధిలో పెయింట్స్ వ్యాపారం చేస్తున్న సిరికొండ శ్రీనుపై సోమవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన నలుగురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. ఆతడి వద్ద నుంచి రూ.8 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం కల్లూరు గ్రామానికి చెందిన నవీన్ దుకాణం బంద్ చేసి ఇంటికి వెళుతున్న సమయంలో ఈ దాడి జరిగింది. తొలుత ఇద్దరు వ్యక్తులు బండిపై వచ్చి ఓ వ్యక్తి కల్లూరు వద్ద ఉన్నాడు మా బండి ఆపి ఇటువైపే అని చెప్పాడు. ఈలోగా బండి దిగిన వ్యక్తి ముఖంపై దాడి చేశాడు. ఈలోగా మరో బైక్‌పై ఇద్దరు వచ్చి నగదు లాక్కున్నారు. వాహనం ముఖాలకు ముసుగులు ధరించి ఉన్నట్లు బాధితుడు చెప్పాడు. ఆయన కొంత దూరం వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చి నవీన్ దగ్గరి ద్వంసం చేశారు. హుజూర్‌నగర్ సీఐ చరణ్‌నాయక్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీ

మఠంపల్లి, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఇంట్లో పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన మఠంపల్లి మండలం చౌటపల్లిలో మంగళవారం జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. ఉదయం మండల పరిధిలో చేసేందుకు మేకలు వెళ్లిన జానీరెడ్డి పొలానికి, భార్య కూలీ పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దొంగలు బీరువా తాళాలు పగులగొట్టి రెండు జతల చెవి దిద్దులు, రెండు ఉంగరాలతో పాటు ఒక జత వెండి పట్టీలు, రూ.10వేల నగదును అపహరించుకుపోయారు. చోరీ అనంతరం దొంగలు ఇంటికి యథావిధిగా తాళం వేసి వెళ్లడం విస్మయాన్ని కలిగిస్తోందని స్థానికులు తెలిపారు. తస్కరణకు గురైన ఆభరణాల విలువ రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుందని బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

34 లీటర్ల సారాయి, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు చోట్ల నిర్వహించిన దాడుల్లో 34 లీటర్ల సారాయి, నాలుగు ద్విచక్ర వాహనాలను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ నాగార్జునరెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం కొత్తతండాకు చెందిన భూక్యా వస్రాం తన ద్విచక్రవాహనంపై 16 లీటర్ల సారాయిని అక్రమ రవాణా చేస్తుండగా మఠంపల్లి వద్ద పట్టుకొని సీజ్ చేశామని తెలిపారు. అదే తండాకు చెందిన బానోతు బాలు ద్విచక్రవాహనంపై సారాను తరలిస్తుండగా చింత్రియాల వద్ద పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. చింతలపాలెం పీక్లానాయక్ తండాకు చెందిన బానోతు సక్రూను తమ్మారం వద్ద, మఠంపల్లి మండలం రఘునాథపాలెంకి చెందిన హనుమ్‌మీరాను మఠంపల్లి వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు జగన్మోహన్ రెడ్డి, దివ్య, సిబ్బంది నాగరాజు, రవికుమార్, రుక్మారెడ్డి, ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు పరిశీలించి సమస్యలు పరిష్కరించాలి

మునగాల, న్యూస్‌టుడే: మునగాల గ్రామ పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు ఎవరు అర్హులో గుర్తించేందుకు జాబితాపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మునగాల ఓటరు జాబితాను పరిశీలించి సూచనలు చేశారు. కుటుంబంలోని అందరూ ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డబుల్ ఓటర్లు, చనిపోయిన వారిని జాబితా నుంచి తొలగించాలన్నారు. ప్రజలు ఓటరు జాబితాకు సంబంధించి సమస్యలను సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసుకోవాలన్నారు. ఎంపీడీవో రమేష్ దీనదయాళ్, తహసీల్దార్ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: మండలంలోని కందిబండ విద్యుత్ ఉపకేంద్రంలో సాంకేతిక పనుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్ అన్నారు. నేరేడుచర్ల, పాలకవీడు, మఠంపల్లి మండలాలకు సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరేడుచర్ల మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రెడ్డిపల్లి శీనయ్య, ప్రధానకార్యదర్శిగా అక్కయ్య బాబు, ఉపాధ్యక్షురాలిగా ఎం.మాధవి ఎన్నికయ్యారు.



నేరేడుచర్లలో మాట్లాడుతున్న ఎస్.అనిల్‌కుమార్

చివరి భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోండి

మునగాల, న్యూస్‌టుడే: సాగర్ ఎడమ కాల్వ కింద ఉన్న చివరి భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో వ్యవసాయ విస్తరణ అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రతిరోజు అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో రమేష్ దీనదయాళ్, ఏఈవోలు నాగ, భవాని, రమ్యతేజ, ఉపశ్రీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక, శారీరక వికాసానికి దోహదం

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలు మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయని సీఐ చరణ్‌నాయక్ అన్నారు. రాజు అన్నారు. కర్మాయిగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డివిజన్ వాలీబాల్, ఖోఖో పోటీలను హుజూర్‌నగర్, మఠంపల్లి ఎంఈవోలు సైదానాయక్, చైతన్యనాయక్‌తో కలిసి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. బాలికల పోటీలు బుధవారం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

రక్తదానం

కోదాడ, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీలతారెడ్డి హాజరయ్యారు. మంగళవారం పట్టణంలో సామాజిక వైద్యశాలలో పార్టీ తరఫున రక్తదాన శిబిరం ప్రారంభించారు.

సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం అవసరం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: సేవా కార్యక్రమాల్లో యువకులు భాగస్వాములు కావాలని ప్రియదర్శిని విద్యాసంస్థల కరస్పాండెంట్ పశ్య శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. నడిగూడెం: కేఎల్ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు.



కోదాడలో శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

హుజూర్‌నగర్: విద్యార్థులు జాతీయ సేవా పథకంలో(ఎన్ఎస్ఎస్) చేరి సమాజానికి సేవలు అందించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులతో ప్లాస్టిక్ నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహించారు.


కోదాడ: నా కోసం కాదు మీ కోసం అనే నినాదంతో విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఎన్ఎస్ఎస్ ఛైర్మన్, కేఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి అన్నారు.

ఆవుకు రేబిస్.. ఆందోళనలో గ్రామస్థులు

నడిగూడెం, న్యూస్‌టుడే: నడిగూడెం గ్రామంలో పుట్టపాక వెంకట సుబ్బారావుకు చెందిన ఆవుకు రేబిస్ సోకింది. కుక్క కరిచినా యజమాని చికిత్స చేయించకపోవడంతో ఆవుకు రేబిస్ సోకినట్లు పశువైద్యుడు రవికుమార్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి దుర్గా ప్రసాద్ గ్రామస్థులు, సిబ్బందితో కలిసి కుక్కకు వ్యాధి సోకిన ఆవును తాళ్లతో బంధించారు. ఆవును జనావాసాలకు దూరంగా ఉంచాలని, నివారణకు అవసరమైన మందులను తెప్పించాలని యజమానికి సూచించినట్లు పశువైద్యాధికారి తెలిపారు.

అవగాహన కార్యక్రమాలు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే ఆలోచన విధానంలో మార్పు రావాలని బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారి మీరా సూచించారు. కీతవారిగూడెం ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు విద్య, ప్రవర్తన, లక్ష్యాలు, పరివర్తన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఉజ్వల భవిష్యత్తు, అనుకున్న లక్ష్య సాధనకు, తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఇప్పటి నుంచే పునాది వేసుకోవాలన్నారు. తెలుగు, ఉపాధ్యాయులు కల్పన, సుజాత పాల్గొన్నారు.



గరిడేపల్లి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మీరా

కళాశాలలో డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆకతాయిల వేధింపులపై నిర్వహించిన సమావేశంలో వారు అవగాహన కల్పించారు.

మునగాల గ్రామీణం: విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా సన్మార్గంలో నడవాలని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆకుపాములలో మహాత్మా జ్యోతిబాఫులే బీసీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో సామాజిక అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

ఆపదలో షీ టీమ్‌కు సమాచారం ఇవ్వండి

కోదాడ: విద్యార్థినులు ఆపదలో ఉన్నప్పుడు షీ టీమ్‌కు సమాచారం ఇవ్వాలని పట్టణ ఇన్‌స్పెక్టర్ రాము, షీ టీమ్ ఎస్సై నీలిమ అన్నారు. మంగళవారం పట్టణంలోని కిట్స్ మహిళా ఇంజినీరింగ్

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

వేలంలో రూ.6.73 లక్షల ఆదాయం రాక

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని నెమ్మికల్ శ్రీదండుమైసమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. పూలు, పండ్లు అమ్ముకునే హక్కును వేలం ద్వారా నెమ్మికల్‌కు చెందిన యడవెల్లి మధు రూ.3.20 లక్షలకు దక్కించుకున్నారు. పచ్చి కొబ్బరిచిప్పల సేకరణ హక్కును మహేష్ అనే వ్యక్తి రూ.3.53లక్షలకు సొంతం చేసుకున్నారు. వీటిద్వారా ఆలయానికి రూ.6.73 లక్షల ఆదాయం సమకూరనుంది. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ నల్గొండ ఇన్‌స్పె సుమతి, ఈవో కె.కుశలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎంపిక

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) ఆత్మకూర్(ఎస్) మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా అధ్యక్షుడు ఎన్.సోంబాబు, ఎన్నికల అధికారి జి.వెంకటయ్య సమక్షంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల శాఖ నూతన అధ్యక్షుడిగా పాతర్లపహాడ్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పి.కరుణాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొప్పారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మేక వంశీ ఎంపికయ్యారు.


పి.కరుణాకర్‌రెడ్డి, అధ్యక్షుడు


మేక వంశీ, ప్రధాన కార్యదర్శి

ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్, మహిళా ఉపాధ్యక్షులుగా బి.జ్యోతి, మండల కోశాధికారిగా జె.లింగస్వామి, మండల కార్యదర్శులుగా వనమాల శ్రీనివాస్, పి.కనకమ్మ, బి.లింగయ్య, కె.వసంత, జి.వీరు, బాణాల రమేష్‌ను ఎన్నుకున్నారు. మండల ఆడిట్ కన్వీనర్‌గా అంజయ్య, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ కన్వీనర్‌గా జి.రమేష్, మండల ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా సుభాష్ చంద్రబోస్‌ను నియమించారు.

సమయాన్ని వృథా చేయొద్దు

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని, ఆ దిశగా పయనించేందుకు చదువుపై దృష్టి సారించాలని ప్రిన్సిపల్ పెరుమాళ్ల యాదయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే 15 మంది విద్యార్థులకు వృత్తి విద్యా అధ్యాపకుడు సతీష్ ఉచితంగా అందించిన ఏకరూప దుస్తులను మంగళవారం పంపిణీ చేసి మాట్లాడారు. సమయాన్ని వృథా చేయకుండా ఇప్పటి నుంచే పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు.

పొట్టి శ్రీరాములు పేరు తొలగింపు నిర్ణయం బాధాకరం

తుంగతుర్తి, న్యూస్‌టుడే: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును యథావిధిగా కొనసాగించాలని తుంగతుర్తి మండల ఆర్యవైశ్య సంఘ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం తుంగతుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశ స్వాతంత్య్ర పోరాటంలో తనదైన పాత్ర పోషించి ప్రజల అభిమానాన్ని చూరగొన్న అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి తొలగించటం బాధాకరమన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో తాటికొండ సీతయ్య, ఓరుగంటి శ్రీనివాస్, ఈగ నాగన్న, మాశెట్టి వెంకన్న, శ్రీనివాస్, బండారు నాగన్న, భిక్షం పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలన, బాలికల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఏపీఎం అజయ్ నాయక్ అన్నారు. కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్యవివాహ రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు తగిన కృషిచేస్తామని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంస్థ మండల కమ్యూనిటీ సోషల్ మొబలైజర్ సోమన్న, ఎంఎస్ అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి నాగమణి, శ్రీనిధి మేనేజర్ జ్యోతి, స్వరూప, ఉపేంద్ర, వీవోఏలు పాల్గొన్నారు.

అమరుల పోరాటాన్ని కొనసాగిద్దాం: పీడీఎస్‌యూ

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో అక్టోబరు 4న, హైదరాబాద్‌లో 24న జరిగే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాల సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి కోరారు. ఉత్సవాల కరపత్రాలను మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. విద్యార్థి అమరుల పోరాట వారసత్వాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, షారోని, పవిత్ర, రాజేశ్వరి, సౌమ్య, మహేష్, నవీన్, తరుణ్, దేవదాస్ పాల్గొన్నారు.

తహసీల్దారుకు వినతి

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: రాష్ట్రంలో 61 ఏళ్లు నిండి ఎటువంటి ప్రయోజనం పొందని వీఆర్ఏల వారసులకు 81 జీవో ప్రకారం ఇస్తామన్న ఉద్యోగాలకు వెంటనే ఇవ్వాలని బాధితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ బి.వినోద్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో 61 ఏళ్లు నిండిన వీఆర్ఏల వారసులు దేవులపల్లి సైదులు, షేక్‌మీరా, సలీమ్, లింగయ్య, సుభద్ర పాల్గొన్నారు.

నేడు తెజస మండల ప్లీనరీ

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని నెమ్మికల్ పూర్ణిమా ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 25న నిర్వహించే తెలంగాణ జన సమితి(తెజస) మండల ప్లీనరీని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొల్లు కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్లీనరీలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బందికి సన్మానం

నూతనకల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు, ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగస్వాములైన మండలంలో గ్రామపంచాయతీ సిబ్బందిని మంగళవారం సన్మానించారు. వారికి వైద్యపరీక్షలు చేపట్టారు.

నేడు ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల వివరాలను అంతర్జాలంలో నమోదు చేసే యాప్‌పై బుధవారం నూతనకల్, మద్దిరాల మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈవో రాములు నాయక్ తెలిపారు. అన్ని యాజమాన్యాల కింద ఉన్న ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్నం 2 గంటలకు హాజరు కావాలని కోరారు.

శ్రీసూర్య క్షేత్రంలో పూజలు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తిమ్మాపురంలోని శ్రీఅఖండ జ్యోతి స్వరూప శ్రీ సూర్యనారాయణ స్వామి ద్వాదశ ఆదిత్యాది క్షేత్రంలో మంగళవారం హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు ఇచ్చారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో..)

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3213	1509
జైశ్రీరాం	3339	1569
ఐఆర్-64	2034	2034
హెచ్ఎంటీ	3008	2179
ఆర్ఎన్ఆర్	3151	3151
కందులు	9396	4039
పెసర	8629	3999
వేరుసెనగ	7259	7259
మినుములు	5796	5796

గుంతలు.. కళ్లకు గంతలు

❒ వర్షాలకు దెబ్బతిన్న సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారి


సూర్యాపేట పురపాలిక పరిధిలోని కుడకుడలో రహదారిపై ఏర్పడిన గంతలు


ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామశివారులో గుంతలమయంగా రోడ్డు

భానుపురి, ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం నుంచి వరంగల్, మహబూబాబాద్ జిల్లాలకు వెళ్లే సూర్యాపేట-దంతాలపల్లి రహదారి అధ్వానంగా మారింది. నిత్యం వాహనాల రద్దీ ఉండే ఈ దారి ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతింది. తారు లేచిపోయి.. కంకర తేలింది. ఎక్కువ సంఖ్యలో గుంతలేర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. రాత్రి సమయంలో రోడ్డును అంచనా వేయలేక వాహనదారులు ఒకేసారి బ్రేక్ వేసి కిందపడుతున్నారు. సూర్యాపేట నుంచి నూతనకల్ వరకు దారంతా గుంతలమయంగా మారినా సంబంధిత అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. దీంతో దెబ్బతిని ఎగుడుదిగుడుగా మారిన రోడ్డుపైన వాహనదారులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రమాదాల సంఖ్య పెరగకముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

-పద్మావతి, డీఈ, ఆర్‌అండ్‌బీ, సూర్యాపేట

సూర్యాపేట-దంతాలపల్లి రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్రంగా దెబ్బతింది. మరమ్మతు విషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఆదేశాలు రాగానే వెంటనే మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

తీవ్ర సమస్య గల ప్రాంతాలు

❒ సూర్యాపేట పురపాలిక పరిధిలోని కుడకుడలో, శివారులో గుంతలు దర్శనమిస్తున్నాయి.

❒ ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ ఆలయం వద్ద, గ్రామ శివారులో గంతలు ఏర్పడ్డాయి, బోరింగ్‌తండా, పాతర్లపహాడ్ శివారులోనూ ఇదే పరిస్థితి. నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయం, గ్రామ శివారులో మోకాలు లోతు గుంతలుండటంతో వాహనదారులు కుదుపునకు లోనవుతున్నారు. నడుమునొప్పితో బాధపడుతున్నామని వాపోతున్నారు.

❒ నూతనకల్ మండలం గుండ్లసింగారం, వాగు పరిధిలో దారి దెబ్బతింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుండ్లసింగారం ఏరు పొంగిపార్లడంతో బీటీ రోడ్డు కోతకు గురైంది. ఏటిపైన నిర్మించిన వంతెన ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ఇక్కడ భయం, భయంగా రాకపోకలు సాగిస్తున్నారు.

తిరుమలగిరి, న్యూస్‌టుడే:

? తిరుమలగిరిలోని సూర్యాపేట-జనగామ ప్రధాన రహదారిపై వీధిదీపాలు కొన్ని వెలగడం లేదు. -కె.లోకేశ్, తిరుమలగిరి

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం. -ఎం.బుచ్చిబాబు, ఇన్‌ఛార్జి కమిషనర్, తిరుమలగిరి పురపాలిక

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
సూర్యాపేట: 9154395978
తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని ఖమ్మం రోడ్డులో రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగడం లేదు. అంధకారం నెలకొని కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. -వెంకన్న, సూర్యాపేట

✔ సిబ్బందికి చెప్పి వెలిగేలా చూస్తాం. -శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో మురుగు కాల్వల్లో పూడిక తీయటం లేదు. మురుగు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. -రవి, హౌసింగ్‌బోర్డు కాలనీ

✔ సిబ్బందితో వెంటనే తీయిస్తాం. -సురేష్, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్, సూర్యాపేట

తొలగిన బురద

స్పందనకు వందనం

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మాచనపల్లిలో చేతిపంపు చుట్టూ మురుగు నీరు చేరి బురదమయంగా మారడంతో నీళ్లు పట్టుకోలేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై సోమవారం 'ఈనాడు'లో 'చుట్టూ బురద.. నీళ్లు పట్టుకునేదెలా' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం ఎంపీడీవో సునీత ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ఉమేష్ సిబ్బందితో చేతిపంపు చుట్టూ ఉన్న బురదను తొలగించి చెత్త లేకుండా చేశారు. చేతిపంపు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకున్నారు.

కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించండి

తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల నోడల్ అధికారి వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కాశీతండా, సింగారంతండా ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. త్వరలో జరగబోయే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(నాస్) పరీక్షకు 3వ తరగతి విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, యాకుబ్, కల్పన, వేణుగోపాల కృష్ణ, ఉపాధ్యాయులు, సీఆర్పీ పాల్గొన్నారు.


కాశీతండాలో విద్యార్థితో పాఠం చదివిస్తున్న మండల నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటాం: గాదరి


తిరుమలగిరిలో ప్రమాద బీమా చెక్కు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తిరుమలగిరి, న్యూస్‌టుడే: భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ కంటికిరెప్పలా కాపాడుకుంటామని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ అన్నారు. మంగళవారం తిరుమలగిరిలో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. పార్టీ సభ్యత్వం కలిగి ఉన్న ప్రతి కార్యకర్తకు బీమా సౌకర్యం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంకేపల్లి రఘునందన్‌రెడ్డి, తెడ్డు భాస్కర్, కొమ్ము వెంకన్న, సందీప్, పానుగంటి నర్సింహారెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

తుంగతుర్తి గ్రామీణం: మంచ్యాతండాకు చెందిన లకావత్ సోమ్లు ఇటీవల మృతిచెందారు. సోమ్లు భారాస సభ్యత్వం కలిగి ఉండటంతో బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం తిరుమలగిరిలో రూ. రెండు లక్షల బీమా చెక్కును మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో భారాస మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు మాన్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


వెలుగుపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పర్యవేక్షణాధికారిణి అనురాధ

తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: పౌష్టికాహారం తీసుకుంటేనే ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ పర్యవేక్షణాధికారిణి అనురాధ అన్నారు. పోషణ మాసంలో భాగంగా మంగళవారం వెలుగుపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు, గాంధమ్మ, మంజుల, అమృత, సంగీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలగిరి: అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే సేవలపై ప్రజల్లో అవగాహన పెంచాలని డీడబ్ల్యూవో నర్సింగరావు అన్నారు. మంగళవారం బీసీకాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం అందుతున్న సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కందుకూరి మంగమ్మ పాల్గొన్నారు.

వ్యాపారుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తా: ఎమ్మెల్యే

తిరుమలగిరి, న్యూస్‌టుడే: తిరుమలగిరిలోని తెలంగాణ చౌరస్తాలో చేపట్టే పైవంతెన నిర్మాణం వల్ల నష్టపోతున్న వ్యాపారులు, భవన యజమానులు మంగళవారం బాలాజీ ఫంక్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. వారి ఆహ్వానం మేరకు అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే మందుల సామేల్‌కు పైవంతెన నిర్మాణం వల్ల వాటిల్లే నష్టాలను వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వంతెన పనులు ఆపేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. వ్యాపారలందరూ ఐకమత్యంగా ఉండి ముందుకు వస్తే రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ద్వారా జాతీయ స్థాయి అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్దామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై.నరేశ్, పీఏసీఎస్ ఛైర్మన్ పాలెపు చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీశ్‌కుమార్, మాజీ వైస్‌ఎంపీపీ సుంకరి జనార్దన్, సామ ఆంజనేయులు, బత్తుల శ్రీను, ఎలసోజు భాస్కర్, గుండా భాస్కర్, కిష్టునాయక్, జలగం రాంచంద్రం గౌడ్ పాల్గొన్నారు.


తిరుమలగిరిలో ఎమ్మెల్యే సామేల్‌కు వినతిపత్రం అందజేస్తున్న భవన యజమానులు, వ్యాపారులు

జాజిరెడ్డిగూడెం: కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పర్సాయపల్లి గ్రామానికి వివిధ పార్టీల కార్యకర్తలు లచ్చిరాం, సంతోష, మల్లయ్య, బిక్కు, మంగమ్మ, జ్యోతి, వీరస్వామి, సోమ్లా, ఎల్లమ్మ, భద్రులతో పాటు మరికొంత మంది సోమవారం రాత్రి తిరుమలగిరిలో ఎమ్మెల్యే సామేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొరిపిడత అవిలయ్య, దండ వీరారెడ్డి, మాజీ సర్పంచి కనకమ్మ, సోమయ్య, కరుణాకర్, సత్తయ్య పాల్గొన్నారు.

పుస్తెలతాడు చోరీ

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట మండలం రాయినిగూడెంలో సోమవారం రాత్రి వరండాలో నిద్రిస్తున్న మహిళ మెడలోని పుస్తెలతాడును దుండగులు అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయినిగూడెం గ్రామానికి చెందిన మామిడి శివాని, అత్త మామిడి సాలమ్మ తమ ఇంట్లోని వరండాలో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి శివాని మెడలోని మూడు తులాల పుస్తెలతాడును లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గ్రామీణ ఎస్సై బాలునాయక్ తెలిపారు.

జాతీయ సేవా దినోత్సవం

తుంగతుర్తి, న్యూస్‌టుడే: జాతీయ సేవా దినోత్సవంలో భాగంగా మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రదర్శన చేపట్టి, కళాశాల ఆవరణలో ముళ్లచెట్లను తొలగించారు. కార్యక్రమంలో పీవోలు పుల్లయ్య, గణేశ్, అధ్యాపకులు మధుకర్, భగత్‌సింగ్, నాగయ్య, రాంబాబు పాల్గొన్నారు.

నిబద్ధతతో సర్వే చేపట్టండి

నూతనకల్, న్యూస్‌టుడే: ఓటరు జాబితాలో సవరణలు, కొత్త ఓటర్ల నుంచి దరఖాస్తుల స్వీకరణపై నిర్వహించే ఇంటింటి సర్వేను నిబద్ధతతో చేపట్టాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు కోరారు. నూతనకల్ తహసీల్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలకు అవగాహన సదస్సు నిర్వహించి సర్వే కిట్ అందించారు. కార్యక్రమంలో ఆర్ఐలు ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ రామచంద్రయ్య పాల్గొన్నారు.


నూతనకల్‌లో బీఎల్‌వోలకు సర్వే కిట్ అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రావు

ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపల్ దూషించాడని ఆందోళన

సూర్యాపేట (మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపల్ ఓ విద్యార్థిని అసభ్య పదజాలంతో దూషించడంతో తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం ఆ పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాలమహానాడు నాయకుల నివాళి

తిరుమలగిరి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో మాలమహానాడు రాష్ట్ర కమిటీ విస్తృత స్థాయి సమావేశానికి మంగళవారం తిరుమలగిరి నుంచి ఆ సంఘ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వెళ్లే ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం పురపాలిక అధ్యక్షుడు గంట లక్ష్మణ్, గంట సందీప్, గంట సంపత్, యాకోబు, దావీదు, జాన్ నర్సయ్య, నాగార్జున్, రవి, రూబెన్ పాల్గొన్నారు.

ఇరువర్గాల దాడుల్లో ఆస్తులు ధ్వంసం

మద్దిరాల, న్యూస్‌టుడే: భూతగాదాల్లో భాగంగా ఇరువర్గాల దాడులకు పాల్పడగా ఆస్తులు ధ్వంసమైన ఘటన మండలకేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. సీఐ శ్రీను, ఎస్సై ఎం.వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన వల్లపు రమేష్, నవిళ్ల మల్లారెడ్డి మధ్య పదిహేనేళ్లుగా భూతగాదాలు కొనసాగుతుండగా, ఆ కేసు కోర్టులో ఉంది. సోమవారం రాత్రి నవిళ్ల మల్లారెడ్డి ఇంటిని గుర్తు తెలియని దుండగులు పొక్లెయిన్‌తో కూల్చివేశారు. వల్లపు రమేష్‌కు చెందిన పొక్లెయిన్, బొలేరో వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇరువర్గాలకు చెందిన నవిళ్ల మల్లారెడ్డి, వల్లపు రమేష్ తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


బహిరంగ సభకు తరలిన రేషన్ డీలర్లు

నూతనకల్, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభకు నూతనకల్ నుంచి రేషన్ డీలర్లు మంగళవారం ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. డీలర్లకు ప్రతి నెలా వేతనాలు అందించి కమీషన్ పెంచాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు కాసోజు శంకర్, ప్రధాన కార్యదర్శి జహంగీర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మరికంటి సంజీవ, మారగాని మారయ్య, శ్రీపాది అశోక్, కోటయ్య, క్రిష్టారెడ్డి, జూలూరి కృష్ణమూర్తి, భద్రాచలం, బిక్కి రవి, శ్రీను పాల్గొన్నారు.

నాగారం: ఎన్నికల హామీ మేరకు కనీస వేతనం అమలు చేయాలని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పాశం మధుసూదన్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభకు మండల రేషన్ డీలర్లు మంగళవారం బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన నాగారంలో మాట్లాడారు. నాగమల్లయ్య, పుష్పాంజలి, వినీత, సూరయ్య, ఉప్పలయ్య, లింగయ్య, మట్టమ్మ, దేవకమ్మ పాల్గొన్నారు.

నిబంధనలు మరచి.. లారీలు నిలిపి

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణంలో జాతీయ రహదారుల పక్కన లారీలను యథేచ్ఛగా నిలుపుతున్నారు. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్, ఖమ్మం రోడ్డు, శాంతినగర్, జనగామ ఎక్స్‌రోడ్డు వద్ద ఈ సమస్య నెలకొన్నా సంబంధిత అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. అంబేడ్కర్‌నగర్‌లో మార్కెట్ రోడ్డుకు వెళ్లే మార్గంలో లోడ్‌తో వచ్చిన వాహనాలు దారి పక్కనే నిలిపి ఉంచుతున్నారు. ఇక్కడి నుంచి మార్కెట్‌కు, కాలనీలకు వెళ్లేందుకు రైతులు, వాహనదారులు, కాలనీవాసులు నరకయాతన పడుతున్నారు. ఇక్కడ నాలుగు దారులు ఉండగా.. అన్ని చోట్ల నుంచి వాహనాలు వేగంగా వస్తున్నాయి. లారీలను నిలపటంతో ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని వెళ్తున్నారు.


సూర్యాపేట: అంబేడ్కర్‌నగర్‌కు వెళ్లే మార్గం వద్ద జాతీయ రహదారిపై నిలిపిన లారీలు

❒ ఖమ్మంలో రోడ్డులో సిమెంటు లారీలను ఇష్టారాజ్యంగా ఆపుతుండటంతో దారి మళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భగత్‌సింగ్‌నగర్‌కు, చింతలచెరువు కాలనీకి వెళ్లేందుకు మలుపుల వద్ద ఈ సమస్య వేధిస్తోంది.

❒ జనగామ రోడ్డులో రాత్రి సమయంలో దగ్గరకొచ్చే వరకు ఆపిన లారీలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

❒ శాంతినగర్ వద్ద కూడా రోడ్డుపక్కనే లారీలు, ఇతర వాహనాలను నిలుతుండటంతో శాంతినగర్, విజయకాలనీకి, కేసారం వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. బైపాస్ లేకపోవడం, దారి ఇరుకుగా ఉండటం, విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిలో వాహనాల రద్దీగా ఎక్కువగా ఉండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

❒ సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్‌ను వివరణ కోరగా జాతీయ రహదారుల పక్కన లారీలను నిలపకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాత్రి సమయంలో గస్తీ నిర్వహిస్తామని చెప్పారు.

'భాజపాకు పెరుగుతున్న ఆదరణ'

భానుపురి, న్యూస్‌టుడే: లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో భాజపాకు ఆదరణ పెరుగుతోందని, ఇందుకు ప్రజలు తీసుకుంటున్న సభ్యత్వాలే నిదర్శనమని ఆ పార్టీ సభ్యత్వ నమోదు రాష్ట్ర ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. సూర్యాపేటలోని 16వ వార్డులో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి భాజపా నిరంతరం పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జుట్టుకొండ సత్యనారాయణ, కర్నాటి కిషన్, ఎండీ అబీద్, సలిగంటి వీరేందర్, సంకినేని వరుణ్‌రావు, సలిగంటి సరిత పాల్గొన్నారు.


సూర్యాపేటలో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, వెంకటేశ్వర్‌రావు

క్రీడలతో మానసికోల్లాసం

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంఈవో బాలునాయక్ అన్నారు. జాజిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి క్రీడలను ప్రారంభించారు. అండర్-14, అండర్-17 విభాగంలో బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో ఆడుతారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో ప్రభాకర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్‌పర్సన్ వెంకటరమణ, పీడీలు మల్లేష్, సైదులు, దాసయ్య, నాగమణి, లలిత పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అర్వపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జాజిరెడ్డిగూడెం, నాగారం, తిరుమలగిరి, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాల ఎంపీడీవోలతో జడ్పీ సీఈవో అప్పారావు, ఇన్‌ఛార్జి డీపీవో నారాయణరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలాంటి తప్పులు లేకుండా జాబితాను సరి చూడాలని జడ్పీ సీఈవో సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు పవన్ కుమార్, శ్రీనివాస్, లాజర్, శేషు కుమార్, సత్యనారాయణరెడ్డి, ఎంపీవో మారయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

జాజిరెడ్డిగూడెం: స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి అధికారులే కాకుండా ప్రజలు భాగస్వాములు కావాలని జడ్పీసీఈవో అప్పారావు అన్నారు. జాజిరెడ్డిగూడెంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. పల్లె దవాఖానాకు భవనం లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్న గురుకుల పాఠశాల భవనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రంథాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీపీవో నారాయణరెడ్డి, ఎంపీడీవో పవన్ కుమార్, డాక్టరు నగేష్, ఏపీవో ఉపేందర్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్ పాల్గొన్నారు.


జాజిరెడ్డిగూడెంలో పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న జడ్పీ సీఈవో అప్పారావు, ఇన్‌ఛార్జి డీపీవో నారాయణరెడ్డి